క్లుప్తంగా

ఉగ్రవాదులను హతమార్చాలి..


సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న మాజీ సైనికులు

విజయనగరం టౌన్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పౌరులను హతమార్చిన ఉగ్రవాదులను హతమార్చాలని మాజీ సైనిక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు దేవర ఈశ్వర రావు అన్నారు. ఉగ్రదాడులకు ప్రతిగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులపై దాడి చేయడం శుభపరిణామమన్నారు. ఈ మేరకు సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద బుధవారం సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బారుకుల వెంకటరావు, ప్రధాన సలహాదారు అప్పికొండ వాసుదేవరావు, వివేకానంద, మాజీ సైనికులు పాల్గొన్నారు.

నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకోండి


తూనికలు, కొలతలు శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న జై భీమ్‌రావు భారత్ పార్టీ ప్రతినిధులు

విజయనగరం: ఆహార భద్రతా నియమాలు పాటించని హోటళ్లు, పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తూనికలు, కొలతల శాఖ అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వివిధ రకాలైన ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారు చేసే హోటళ్లు, పరిశ్రమల ప్రతినిధులపై శాఖాపరమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మరడాన వెంకటనాయుడు, పైల జ్యోతి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ చిన్నం అరుణ్‌కుమార్, జిల్లా కమిటీ ప్రతినిధి పొడుగు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి, శ్రీనివాసరావు ఉన్నారు.

భారత్ ప్రతీకారం గర్వకారణం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం: ఆహ్లాదకర వాతావరణంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన అమాయకులైన పర్యాటకులను అన్యాయంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే 'ఆపరేషన్ సిందూర్' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని.. తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనమని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి వందనం అని పేర్కొన్నారు. యావత్ భారత దేశం ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించాలని.. భారత సైన్యానికి అండగా నిలవాల్సిన తరుణమని పిలుపునిచ్చారు.

పీటీసీలో సోలార్ లైట్లు


సోలార్ లైట్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరాజు

విజయనగరం క్రైమ్: నగరంలోని కంటోన్మెంట్‌లో గల పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో సోలార్ లైట్లను కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీజీపీ, ట్రైనింగ్ ఐజీ ఉత్తర్వుల మేరకు పీటీసీలో కొన్ని మరమ్మతులకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో పోలీస్ కానిస్టేబుళ్ల ట్రైనింగ్‌కి శిక్షణార్థులు రానున్నారని తెలిపారు. ఈ లోగా కళాశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం క్లాస్ ఫోర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, డీఎస్పీలు శ్రీకాంత్, రమేష్‌లతో పాటు సీఐలు, ఎస్సైలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జోగారావు

విజయనగరం ఫోర్ట్: వేతన సవరణకు సంబంధించి 12వ పీఆర్సీ వేసి తక్షణమే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ఎస్టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) జిల్లా అధ్యక్షుడు కె. జోగారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూత్ హాస్టల్‌లో ఎస్టీయూ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 1 ప్లస్ 5 విధానంతో ఉపాధ్యాయలను నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించడంతో పాటు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం..

- రసాయన ఎరువులతో చౌడుబారుతున్న భూములు
- ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


నవధాన్యాల కిట్లను రైతులకు అందజేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

పూసపాటిరేగ: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ప్రజలను చైతన్య పరుస్తున్నారు. సాగులో మొదటగా నవధాన్యాలు సాగు చేయడంతో మానవాళి మనుగడకు ఎటువంటి ముప్పు ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపం తగ్గాలన్నా.. భూసారం పెరగాలన్నా.. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం రసాయన ఎరువులు విచ్చలవిడిగా వినియోగించడం వల్ల భూసారం క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో భూమి సారవంతం కావాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 800 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు జరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సాగు గతేడాది కంటే ఎక్కువ విస్తీర్ణంలో చేయాలనే ఆలోచనలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు. భూసారం తగ్గిన పొలాలే కాకుండా చౌడు భూములు సైతం మళ్లీ సారవంతం కావాలంటే ఖరీఫ్ సీజనకు ముందు రైతులు నవధాన్యాలు సాగు చేయాలి. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది 21 రకాలు నవధాన్యాలు (12 కిలోల కిట్లు) నామమాత్రపు రేటుకే రైతులకు అందజేస్తున్నారు. మిశ్రమ విత్తనాలు పొలంలో వేసుకుని మొక్కలు వచ్చిన తర్వాత బాగా కలియదున్నడం వల్ల భూమికి కావాల్సిన పోషకాలు అందిసారం పెరుగుతుంది.

నవధాన్యాలు సాగుతో..

నవధాన్యాల సాగుతో మొక్కలకు నత్రజని, సూపర్‌ఫాస్ఫేట్ అదనంగా అందడంతో పాటు భూమిలో సారం పెరుగుతుంది. నేలలో కరగని మూలకాలను సైతం పంటకు అనుకూలంగా మారుస్తుంది. మాంగనీస్, ఇనుము, కాల్షియం, జింక్, తదితర సూక్ష్మజీవులు పంటకు అందుతాయి. నేల భౌతిక స్థితి మెరుగుపడడంతో సాగులో రెట్టింపు దిగుబడులు వస్తాయి. నేలలో సేంద్రియ పదార్థాలు వేయడంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమి సారవంతంగా మారుతుంది. దీంతో ఏ పంట సాగు చేసినా అధిక దిగుబడులు వస్తాయి. మే నెలలోనే వేసవి దుక్కులు చేసి తొలి వర్షాలకు నవధాన్యాలు చల్లుకోవాలి. నవధాన్యాలు వేసిన 45 రోజుల వ్యవధిలో సాగును కలియదున్నాలి.

విస్తీర్ణం పెరుగుతోంది..



ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం రానురానూ పెరుగుతోంది. గతేడాది కన్నా ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రధాన పంటకు ముందు వేసే నవధాన్యాల సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. భూ సారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయి.

– కె. నీలిమ, మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణంలోని కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అష్టోత్తర కళారాధన, రుద్రాభిషేకం, కుంకుమార్చన, గౌరీ పాశుపత హోమం, పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కె.కృష్ణ, కూటమి నాయకులు కరిమజ్జి గోవిందరావు, జనాప్రసాద్, అప్పికొండ రవి, మజ్జి రాంబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు నడిపిల్లి అశోక్, కార్యదర్శి కొత్త శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కొల్లూరు నాగేశ్వరరావు, సభ్యులు నడిపిల్లి కిషోర్‌కుమార్, మండా రాజా తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



పూసపాటిరేగ: మండలంలోని అల్లాడపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈదాడుల్లో అల్లాడపాలెంనకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై చంద్రమోహన్, హెచ్‌సీ రామారావు, కానిస్టేబుల్ మహేష్ ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎంపీడీఓ రాధికకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పూసపాటిరేగ: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం. రాధికను ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అలాగే విధి నిర్వహణలో మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ. పది లక్షల ఎక్స్‌గ్రేషియా.. కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని.. వేతనదారుడికి ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. అలాగే వేతనదారులకు రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ రాధిక మాట్లాడుతూ.. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజలందరిపై పైడితల్లి ఆశీస్సులు

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని అక్కివరంలో పైడితల్లి సిరిమాను చెట్టు సేకరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. సిరిమాను చెట్టుకు ఎమ్మెల్యే నాగమాధవి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీలు కంది చంద్రశేఖరరావు, మహంతి చిన్నంనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, పూజారి కంది వెంకటరమణ, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పైడితల్లి పండగ సుమారు 120 ఏళ్ల తర్వాత ఈ నెల 12,13,14 తేదీల్లో నిర్వహిస్తున్నారు. 12న తొలేళ్ల ఉత్సవం, 13న సిరిమానోత్సవం, 14న కనుమ పండగ జరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సిరిమాను పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, పోలిపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ, పాల్గొన్నారు.

మన్యం వీరుడికి నివాళులు..


విజయనగరం: మన్యం వీరుడు అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి, తదితరులు

విజయనగరం: విప్లవ జ్యోతిగా పేరుగాంచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..ఆయన పోరాటం, ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. బ్రిటిష్ తూటాలకు ఎదురొడ్డి ప్రాణాలను సైతం త్యజించిన గొప్ప త్యాగశీలని కొనియాడారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, మున్సిపల్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు, టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. నేటి యువత అల్లూరి పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పాపారావు, సూరి, తవిటినాయుడు, రామునాయుడు, సూర్యారావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎందరో వీరులకు స్ఫూర్తి..

విజయనగరం ఫోర్ట్: స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ జ్యోతి అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్. శ్రీనివాసమూర్తి, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ టి. వెంకటేశ్వరావు, సెట్విజ్ సీఈఓ సోమేశ్వరావు, జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ గ్రంథాలయంలో..

విజయనగరం గంటస్తంభం: నగరంలోని గురజాడ గ్రంథాలయం వద్ద భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించి, తెలుగు వారి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన విప్లవ వీరుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో రామ్, శ్రీ, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు


విజయనగరం ఫోర్ట్: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్, తదితరులు


విజయనగరం గంటస్తంభం: అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు

ప్రతిభా పురస్కారం..



గజపతినగరం బాలికల వసతిగృహంలో ఉంటూ ఇంటర్ ఫలితాల్లో 958 మార్కులు సాధించిన గురల కీర్తన రాష్ట్ర ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు విజయవాడలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి డోల బాలవీరాంజనేయులు స్వామి, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతుల మీదుగా కీర్తన పురస్కారం అందుకుంది. విద్యార్థినిని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బోని రామానందం, తదితరులు అభినందించారు. – విజయనగరం టౌన్

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

విజయనగరం గంటస్తంభం: ఆపరేషన్ కగార్ ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం అమర్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజన ప్రాంతంలో 400 మందిని చంపి కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాక్షసానందం పొందుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీకి అండగా నిలుస్తోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అలాగే ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. సంవత్సరానికి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రాష్ట్ర యువతను మోసం చేశాడని ఆరోపించారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్ల పేరుతో దేశంలో ఎక్కడా లేని విధంగా భూ సమీకరణ చేయడంలో ఆంతర్యం ఏమిటిని ప్రశ్నించారు. తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, బుగత అశోక్, ఆనందరావు, రంగరాజు, నాగభూషణం, నీలకంఠశ్వర యాదవ్, అప్పలరాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పౌర సేవలు అందించాలి

- అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతాంశాలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లి మెరుగైన పౌర సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. నగరంలోని 45, 46, 47 నంబర్ల సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కొన్నిచోట్ల విజిటింగ్ పుస్తకాలు లేకపోవడంపై సిబ్బందిని మందలించారు. రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కార్యదర్శులను హెచ్చరించారు. సచివాలయ కార్యాలయంతో పాటు ఆవరణ కూడా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అందరి సహకారంతో పురసేవలు మెరుగుపరచాలన్నారు.

14లోగా వీధి విక్రయదారుల కమిటీలు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

- కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: నగరంలోని వీధి విక్రయదారులను గుర్తించి కమిటీలను పునర్వ్యవస్థీకరించే కార్యక్రమం ఈనెల 14వ తేదీ లోపు పూర్తి చేయాలని కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీధి విక్రయదారులను గుర్తించే సర్వే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలన్నారు. నగరంలో రెడ్, గ్రీన్, ఆరెంజ్ జోన్లను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులను కూడా అందజేయాలన్నారు. రెడ్ జోన్‌లో వీధి విక్రయాలు పూర్తిగా నిషేధమని చెప్పారు. గ్రీన్ జోన్‌లో విక్రయాలు యథేచ్ఛగా కొనసాగించుకోవచ్చని తెలిపారు. ఆరెంజ్ జోన్‌లో నియమిత కాల పరిమితులలో మాత్రమే వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్ఓ సింహాచలం, టౌన్ సర్వేయర్ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు అండగా భారత పౌర సమాజం


సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ, సభ్యులు

- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు పలికిన లోక్‌సత్తా

విజయనగరం గంటస్తంభం: రెచ్చిపోతున్న పాకిస్తాన్ తీవ్రవాదులను మట్టుపెట్టడానికి భారత ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయానికి లోక్‌సత్తా పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..భారతదేశంలోని త్రివిధ దళాలకు దేశంలోని మొత్తం పౌర సమాజం అండగా ఉంటుందని, ఆపరేషన్ సిందూర్‌ను ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారని చెప్పారు. పహల్గాం సంఘటనకు సరైన సమయంలో ప్రధాని మోదీ ప్రతీకారం తీర్చుకున్నారన్నారు. భారత ఆర్మీ, వాయు సేన అధికారులు అత్యంత చాకచక్యంగా పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి ఉగ్రక్యాంప్‌లపై దాడి చేయడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, పౌరవేదిక ప్రతినిధులు తుమ్మగంటి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, పైడిరాజు, తదితులు పాల్గొన్నారు.